క్లుప్తంగా

వ్యయ రిజిస్టర్ల పరిశీలన



వ్యయ రిజిస్టర్లు పరిశీలిస్తున్న రమాకాంత్ ప్రధాన్

సీతంపేట: పాలకొండ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయ రిజిస్టర్లను గురువారం అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు రమాకాంత్ ప్రధాన్ పరిశీలించారు. స్థానిక ఐటీడీఏలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వ్యయ పరిశీలన బృందాలతో రిజిస్టర్లు పరిశీలించారు. మరోమారు ఈ నెల 6, 11 తేదీల్లో పరిశీలిస్తామన్నారు. ఆ రోజుల్లో తప్పనిసరిగా వ్యయ పరిశీలన చేయించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.

సీఎం జగన్ పాలననే ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారు..



పోరాంలో ప్రజలతో మమేకమై నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలోని అన్నివర్గాలకు మేలు అని, ఆయన పాలననే ప్రజలు మళ్లీ మళ్లీ కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని ఉనుకూరు, పోరాం, వప్పంగి, కాగితాపల్లి, పారంపేట, పనసలవలస, బాలకవివలస, మునకలవలస, తోకలవలస, లక్ష్మణవలస, తాటిపాడు, బూరాడ గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అన్నివర్గాల ప్రజలు, అన్నిప్రాంతాలు బాగుండాలన్నదే సీఎం జగనన్న తపన అని, అందుకే ఆయన అనేకానేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు, కార్యక్రమాలు చేపట్టారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామస్తుల వద్దకే ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించారని, అలాగే వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందజేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదేనన్నారు. ఎన్నికల వేళ బూటకపు హామీలు, మాయమాటలతో వస్తున్న టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. అందరం బాగుండాలంటే రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే అధికారంలోకి తీసుకురావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఈవీఎంలో 3వ క్రమసంఖ్య ఎదురుగా ఉన్న ఫ్యాన్ గుర్తుకు ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు రెండూ వేసి, తనను ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్‌మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే మహిళల ఆర్థికాభివృద్ధి

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించగలరని వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సారోతు సుభాషిణి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని వన్నలి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రదేశానికి వారు గురువారం వెళ్లి, అక్కడి మహిళలతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ ఐదేళ్లు ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అనేకానేక సంక్షేమ పథకాలు అందజేసి, ప్రభుత్వం ప్రోత్సహించిందన్నారు. మహిళలు మరింతగా అభివృద్ధి చెందాలన్నా, ఇప్పుడున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేస్తున్న తలే రాజేష్, బెల్లాన చంద్రశేఖర్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

బూత్ కన్వీనర్లు ప్రధాన పాత్ర వహించాలి

రాజాం: ఎన్నికల ప్రచారంలో బూత్ కన్వీనర్లు ప్రధాన పాత్ర వహించాలని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించాలని వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బూత్ కన్వీనర్లతో గురువారం సమావేశమైన ఆయన ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో పార్టీ తరఫున ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేయాలన్నారు. టీడీపీ దుష్ప్రచారాలను తిప్పికొడుతూనే సీఎం జగనన్న చేసిన మంచిని తెలపాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బి.నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు వై.వెంకటేష్, ఎన్.వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

- నవరత్నాలతో ప్రతీ కుటుంబానికి లబ్ధి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



శిఖబడి సమావేశంలో మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని శిఖబడి, తాళ్లడుమ్మ, పెదమేరంగి, కన్నపుదొరవలస, బిత్రపాడు పంచాయతీల్లో ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని అన్నారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చూపించారన్నారు. మేలు జరిగి ఉంటేనే ఓటెయ్యండని అడుగుతున్న దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్ అని అన్నారు. గిరిజన, గిరిజనేతర ప్రాంతాలలో రోడ్లు నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఇంత మేలు చేసిన వారికి ఓటు వేస్తారో? ప్రజల మేలును చూసి జీర్ణించుకోలేని వ్యక్తులకు ఓటేస్తారో? ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ప్రతిపక్ష నాయకులు రెచ్చగొట్టి మాట్లాడినా సంయమనం పాటించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రచారంలో శిఖబడి సర్పంచ్ కోట రమేష్, బిత్రపాడు సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, ఆయా గ్రామాల నాయకులు మాజీ ఎంపీటీసీ బడే మన్మథనాయుడు, మరడాన కిశోర్, వాన నారాయణరావు, చినమేరంగి పీఏసీఎస్ అధ్యక్షుడు తాడేల మన్మథనాయుడు, తిరుపతినాయుడు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

జగనన్నతోనే గిరిజనాభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ నేతల విస్తృత ప్రచారం



చాకలిగూడలో ఇంటింటికి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతంపేట: జగనన్నతోనే గిరిజనాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ బి.ఆదినారాయణ అన్నారు. మండలంలోని కడగండి పంచాయతీ పరిధిలో కడగండి, గజిలి, చాకలిగూడ రోలుగుడ్డి, కోతాం, కుమ్మరిగంటి తదితర పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి తరఫున విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలు అడుగడుగునా పార్టీ నాయకులకు నీరాజనం పలికారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి నాయకులు ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి హ్యాట్రిక్ మెజారీతో ఎమ్మెల్యే కళావతిని గెలిపించాలని అభ్యర్థించారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మించి, వాటి ద్వారా సేవలందించి ప్రజల కష్టాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీర్చారన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజలకు మంచి చేయాల్సిన చంద్రబాబు పింఛన్‌దారుల ఉసురు పోసుకుంటున్నారంటూ మండిపడ్డారు. గత ఐదేళ్లుగా వలంటీర్‌లు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ ఇస్తున్నారని, ఇప్పుడు చంద్రబాబు సకాలంలో పింఛన్‌లు లబ్ధిదారులకు దక్కకుండా అడ్డుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను అందరూ ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.సరస్వతి, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, పార్టీ నాయకులు ఎన్.సోమయ్య, ఎన్.కాంతారావు, ఎన్.అబ్బాస్, సర్పంచ్‌లు ఎస్.సింహాచలం, ఎస్.సువార్త, ఎస్.గంగమ్మ, హెచ్.ఆదిలక్ష్మి, ఎ.కళావతి, ఎంపీటీసీలు చంద్రశేఖర్, గణేష్, హరి, తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం...



వీరఘట్టంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

వీరఘట్టం: పాలకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి గెలుపే తమ లక్ష్యమంటూ స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గురువారం వీరఘట్టం పట్టణ వీధుల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. గాసీవీధి, జనావీధి, రెల్లివీధి, దుర్గపేట, కూరాకుల వీధుల్లో తమ ప్రచారాలతో హోరెత్తించారు.

ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మే 13న జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే కళావతిని, ఎంపీ అభ్యర్థి తనూజారాణిని గెలిపించాలని కోరారు.

టీడీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టండి

రాజాం: ప్రభుత్వంపై టీడీపీ కూటమి నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదే విషయమై మండల కేంద్రంలో విలేకరులతో గురువారం మాట్లాడిన ఆయన.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఎన్నో సంస్కరణలు, విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, ప్రజలకు సుపరిపాలన అందించారన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే పరమావధిగా ఆయన కొనసాగించిన పాలన దేశానికే ఆదర్శమన్నారు. ఆయన పాలనా విధానాలు నచ్చడంతోనే తమలాంటి వారమంతా పార్టీలో చేరామన్నారు. ప్రభుత్వాన్ని గానీ సీఎం జగనన్నను గానీ విమర్శించేందుకు ఏ ఒక్కటీ లేకపోవడంతో ఇంకా అమలుచేయని ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరిట టీడీపీ అధినేత చంద్రబాబు అండ్ కో.. లేనిపోని అసత్యాలతో ప్రజలను ఆందోళనకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని, ఇదంతా వారు కేవలం రాజకీయ లబ్ధి పొందేందుకే చేస్తున్నారన్న విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. కేంద్రం చేసిన ఈ చట్టాన్ని రాష్ట్రంలో ఇంకా అమలు చేయలేదని, అమలు సాధ్యాసాధ్యాలపై ఆలోచన దశలోనే ఏకంగా చట్టం అమలైపోయిందని, ఆ చట్టంతో ప్రజలు భూమలు కోల్పోతారన్న విషప్రచారం చేయడం తగదన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎంతమేర అమలు చేశాం.. ఏ మేర పాలన కొనసాగించాం..అని తెలియజేస్తూనే మీకు మంచి జరిగితేనే ఓటు వేయండి అని అడిగే దమ్మున్న నాయకుడు జగనన్న ఒక్కరేనన్నారు. అదే చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఏ హామీలు ఇచ్చి, అధికారం పొందారు.. ఆ తర్వాత ఆయన ఇచ్చిన హామీలు ఏ మేర అమలుచేశారన్న విషయం ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. ఎన్నికల వేళ ఎలాగైనా అధికారం కోసం పనిగట్టుకుని, ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రచారం చేసే అసత్యాలను ప్రజలకు వివరించి, చైతన్యం చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని, ఓటమి భయంతోనే చంద్రబాబు నీచ రాజకీయాలకు తెరలేపారని దుయ్యబట్టారు. అసత్యాలనే ఆయుధాలుగా చేసుకుని, ఎన్నికల్లో ముందుకు వెళ్తున్న టీడీపీకి ఘోర ఓటమి తప్పదన్నారు.

ప్రభుత్వోన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ కోర్సులు

సీతంపేట: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో 2024 – 25 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా ఇంటర్మీడియట్ కోర్సులు నిర్వహించనున్నట్టు హెచ్ఎం హేమసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల కోరిక మేరకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీలలో ఏవైనా రెండు గ్రూపులు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రతీ గ్రూపుకు 40 చొప్పున సీట్లు ఖాళీగా ఉంటాయన్నారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమౌతాయని తెలిపారు.

ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

బొబ్బిలి: ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించి, స్థానిక వేణుగోపాల ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ తెలిపారు. ఇదే విషయమై ఆమె విలేకరులతో గురువారం మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లు చేపడుతున్నామని, తొలుత ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్లను పొందుపరిచే ప్రక్రియను చేపడుతున్నామన్నారు. ఈ నెల 7వ తేదీన నియోజకవర్గంలోని మొత్తం ఆరుగురు ఓటర్లకు సంబంధించి, హోమ్ ఓటింగ్ చేపట్టనున్నామన్నారు. ఈ నెల 8వ తేదీన ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తామన్నారు.


ఎన్నికల నిర్వహణలో పీవోల పాత్ర కీలకం




పీవోలు, ఏపీవోలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం సిటీ: ఎన్నికల నిర్వహణలో పీవోల పాత్ర చాలా కీలకమని, ప్రస్తుతం ఎన్నికల విధులకు సంబంధించి, ఇస్తున్న శిక్షణలో నేర్పిస్తున్న ప్రతీ అంశాన్ని చక్కగా నేర్చుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల పీవోలు, ఏపీవోలకు ఇస్తున్న మూడో విడత ఎన్నికల శిక్షణను ఆమె గురువారం పరిశీలించారు. శిక్షణలో నేర్పిస్తున్న అంశాల్లో దేనిలోనైనా సందేహాలు ఉంటే వాటిని ఇక్కడే నివృత్తి చేసుకోవాలన్నారు. ఇక్కడ నేర్పించే అంశాలు ఎన్నికలు పక్కాగా నిర్వహించేందుకు దోహదపడతాయన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, నిర్ణీత సమయానికి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని తెలిపారు. అంతకుముందు పోలింగ్ ఏర్పాట్లపై ఆర్‌వో జోసెఫ్, ఏఆర్‌వో ఎస్.కె.రాజులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికలప్పుడు ఎటువంటి వివాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

పింఛన్‌దారులకు టీడీపీ తెచ్చిపెట్టిన కష్టాలు



సీతంపేట: యూనియన్ బ్యాంకు వద్ద మండుటెండలో పింఛన్ లబ్ధిదారుల అవస్థలు



గుమ్మలక్ష్మీపురం యూనియన్ బ్యాంకు తెరవక ముందే వేచి చూస్తున్న పింఛన్‌దారులు

సీతంపేట: గ్రామ వలంటీర్‌ల ద్వారా పంపిణీ చేయాల్సిన పింఛన్‌లను చంద్రబాబు అండ్ కో ఫిర్యాదు చేసి అడ్డుకోవడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పలేదు. మండుటెండల్లో స్థానిక బ్యాంకుల వద్దకు వచ్చి పడిగాపులు కాశారు. బ్యాంకుల వద్ద రద్దీతో అవస్థలు పడ్డారు. మండలంలోని 8,187 పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరందరూ పింఛన్‌ల కోసం మారుమూల ప్రాంతాల నుంచి సీతంపేటలో ఉన్న ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, ఎస్‌వీజీబీ, కుశిమి ఇండియన్ బ్యాంకులకు వచ్చి నానా ఇబ్బందులు పడ్డారు.

పింఛన్‌దారుల కష్టాలు

గుమ్మలక్ష్మీపురం: గత ఐదేళ్లుగా వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే పింఛన్ నగదును అందుకున్న పింఛన్ దారులు ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన సన్నిహితుల కుట్రల కారణంగా ఈ నెలలో తీసుకోవాల్సిన పింఛన్ నగదు కోసం ఇంటి వద్ద కాక బ్యాంకుల వద్దకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎండలు మండిపోతున్నాయి. బయటకు రావాలంటేనే కష్టంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో పలువురు పింఛన్‌దారులు గురువారం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, ఏపీజీవీ బ్యాంకుల వద్దకు చేరుకున్నారు. పలువురి బ్యాంకు ఖాతాలు సక్రమంగా ఉండటంతో నగదును తీసుకోగా, పలువురి బ్యాంకు ఖాతాలు డెడ్ అయిపోయాయని, ఆధార్ కార్డు లింక్ కాలేదని ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని బ్యాంకు అధికారులు సూచించడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు.

అవ్వాతాతలకు సేవకులుగా..



పింఛన్ తీసుకునేందుకు బ్యాంకుకు వచ్చిన వారికి మజ్జిగ అందజేస్తున్న రాజీనామా చేసిన వలంటీర్లు

వీరఘట్టం: నిన్నటి వరకు కోడి కూయక ముందే పింఛన్లు అందుకునే అవ్వాతాతలకు చంద్రబాబునాయుడు అండ్ కో చేసిన ఫిర్యాదుతో కష్టాలు మొదలయ్యాయి. పింఛన్‌ల కోసం బ్యాంకుల వద్ద వృద్ధులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలియడంతో వీరఘట్టం పట్టణానికి చెందిన సుమారు యాభై మంది వలంటీర్లు బ్యాంకుల వద్దకు వచ్చి పింఛన్‌దారులకు విత్‌డ్రా ఫారాలు కొందరు నింపగా, మరికొందరు క్యూలో ఉన్న వారికి మజ్జిగ, మంచినీరు అందజేసి అవ్వాతాతలను అక్కున చేర్చుకున్నారు. వలంటీర్లుగా రాజీనామాలు చేసినప్పటికీ వృద్ధులకు ఎప్పుడూ సేవ చేసేందుకు అందుబాటులో ఉంటామని వృద్ధులకు భరోసా ఇచ్చారు. మండుటెండలో పింఛన్‌ల కోసం వచ్చిన చాలా మంది వృద్ధులు అలసిపోవడంతో వారికి మంచినీరు పట్టి సేదతీర్చారు. సొంత డబ్బులతో మజ్జిగ కొనుగోలు చేసి పంపిణీ చేసిన వలంటీర్లును వృద్ధులు అభినందించారు. తామంతా ఎప్పటికీ జగనన్న సైన్యమే అంటు వలంటీర్లు నినాదాలు చేశారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓలు

పాలకొండ: ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు తమ పేర్లు, సీరియల్ నంబరుతో ఉన్న స్లిప్పులను అందించే చర్యలు వేగవంతం చేశారు. శుక్రవారం నాటికి పంపిణీ పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో బీఎల్‌ఓలు ఈ మేరకు పంపిణీ చేపట్టారు. గురువారం నాటికి 80శాతం స్లిప్పులు పంపిణీ పూర్తి చేశామని తహసీల్దార్ వరహాలు తెలిపారు. ప్రతి ఓటరకు స్లిప్పు అందించేందుకు తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వండి

- ఎన్నికల ప్రచారంలో మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు



కురుపాం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

కురుపాం: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచిన జగనన్న సంక్షేమ ప్రభుత్వానికి మరో అవకాశమివ్వాలని పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు పిలుపునిచ్చారు. మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీలో గుమ్మిడిగూడ, దండుసూర, షేకుపాడు, రంగుపురం, మండల కేంద్రంలోని రెల్లివీధి, దొనకవీధి, దప్పువీధి, శివ్వాలవీధి, పేలస్‌వీధి, గొడగలవీధితో పాటు పలు కాలనీల్లో ఎన్నికల ప్రచారం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలపై వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అందించారన్నారు. మీ కుటుంబాలకు ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో మేలు జరిగితేనే మరో అవకాశమివ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రచారంలో గ్రామ సర్పంచ్ గార్ల సుజాత, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, టీపీఎస్ స్వామియాజులు, గౌడు సంతోషిరాణి, జిల్లా కో ఆప్షన్ సభ్యుల షేక్ నిషార్, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు డా. అంధవరపు కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఆకుల శ్రీధర్, షేక్ నూరెళ్ల, డి.రాము, రాయిపిల్లి శ్రీను,వెల్లంకి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కల నేరవేరుతోందిలా..



వీరఘట్టం ప్రధాన రహదారిలో వేస్తున్న రోడ్డు

- శరవేగంగా వీరఘట్టం రహదారి పనులు
- రూ.5.50 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులు

వీరఘట్టం: దశాబ్దాల కల నెరవేరుతుండడంతో వీరఘట్టం పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా ఆగిపోయిన వీరఘట్టం ప్రధాన రహదారి పనులు గురువారం పునఃప్రారంభం కావడంతో పట్టణ ప్రజలంతా వైఎస్సార్‌సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రూ.5.50 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు రెండేళ్ల క్రితం ప్రారంభమయ్యాయి. ఈ పనులు కొద్ది రోజులుగా నిలిచిపోయాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఈ పనులపై దృష్టి సారించారు.వీరి కృషి ఫలితంతో నేడు పనులు జరుగుతుండడంతో వీరఘట్టం ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధే లక్ష్యం

వీరఘట్టం పట్టణ ప్రజల దశాబ్దాల కల నెరవేర్చడమే మా ధ్యేయమని, వీరఘట్టం పట్టణాభివృద్ధే మా లక్ష్యమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. కొద్ది రోజులుగా నిలిచిపోయిన వీరఘట్టం రహదారి పనులు గురువారం ప్రారంభం కావడంతో అటువైపు వచ్చిన ఎమ్మెల్సీ విక్రాంత్ ఈ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానికులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో స్థానిక టీడీపీ నాయకులు ఓట్లు రాజకీయం చేసి వీరఘట్టం రహదారి విస్తరణ జరగకుండా అడ్డుకున్నారని అన్నారు. వీరఘట్టం పట్టణాభివృద్ధికి రూ.5.50 కోట్లు మంజూరు చేయించిన ఘనత తనతో పాటు ఎమ్మెల్యే కళావతికి దక్కుతుందన్నారు. భవిష్యత్‌లో వీరఘట్టం గొప్ప వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మూడు రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఆయనతో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఈవీఎంల పనితీరు రెండవ విడత పూర్తి చేశాం



ఈవీఎంల పనితీరు పరిశీలిస్తున్న ఆర్‌ఓ శుభం బన్సల్

పాలకొండ: ఈవీఎంల ర్యాండ్ చెక్ రెండో విడత పూర్తి చేశామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ తెలిపారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న స్ట్రాంగ్‌రూం వద్ద ఈవీఎంల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ప్రస్తుతం ఈవీఎంల పనితీరుపై పలు మార్లు పరిశీలన చేస్తున్నామని వివరించారు. కొన్ని ఈవీఎంల ర్యాండ్‌గా ఎంపిక చేసి పరిశీలిస్తున్నామని తెలిపారు. ఇంతవరకు ఎటువంటి లోపాలు లేవని స్పష్టం చేశారు. మరో ఈవీఎంల పరిశీలన కోసం ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ వరహాలను ఆదేశించారు.

నేడు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ప్రచారం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని వంగర, కేదారిపురం, డుమ్మంగి పంచాయతీల్లోని గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం కురుపాం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎంపీపీ కుంబురుక దీనమయ్య గురువారం విలేకర్లకు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.